క్లుప్తంగా

పన్నులు సకాలంలో చెల్లించండి

మున్సిపల్ కమిషనర్ వెంకట్ దాస్



మాచర్ల: పట్టణంలో ఆస్తి, ఇంటి, నీటి పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్ దాస్ అన్నారు. సోమవారం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మార్చి 31వ తేదీలోపు ఆస్తి, ఇంటి, నీటి పన్నులు తప్పనిసరిగా చెల్లించాలన్నారు. పెనాల్టీ లేకుండా 31వ తేదీలోపు పన్ను చెల్లించే అవకాశముందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని పన్నులు తప్పనిసరిగా చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కమిషనర్ కోరారు. మరిన్ని వివరాలకు 9849907309ను సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి



శీలం శివారెడ్డి



కోటిరెడ్డి

వెల్దుర్తి: కల్లంలో మిర్చికి కాపలా కాసేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరిని టాటా మ్యాక్స్ ఢీ కొట్టడంతో మండలంలోని మండాది గ్రామానికి చెందిన శీలం శివారెడ్డి (50), శీలం కోటిరెడ్డి (35)లు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం అర్ధరాత్రి ఇద్దరు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మాచర్ల నుంచి శిరిగిరిపాడు వైపు వెళ్లే వాహనం ఢీ కొట్టడంతో వారు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. గ్రామంలో నుంచి జాతీయ రహదారి దాటుతుండటంతో వేగంగా వస్తున్న టాటా మ్యాక్స్ ఢీ కొట్టడంతో మృతి చెందారు. కోటిరెడ్డికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడున్నారు. శివారెడ్డికి కుమార్తె ఉంది. ప్రమాద వార్త తెలుసుకున్న మండాది గ్రామస్తులు విషాదంలో మునిగిపోయారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు చేరుకొని మృతదేహాలను సందర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

షాలోం ఉత్సవాలు జయప్రదం చేయండి

మాచర్ల: నియోజకవర్గంలోని రెంటచింతల మండలం, రెంటాల గ్రామంలో షాలోం మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు దైవ సేవకుడు అభిషేక్ సోమవారం తెలిపారు. మాచర్ల షాలోం మందిరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మార్చి 5 నుంచి 7వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు షాలోం ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తనతో పాటు దైవ సేవకులు బాల సుందరం పాల్గొంటారని తెలిపారు. ఏసు ప్రభువును స్తుతిస్తూ షాలోం మందిరంలో జరిగే కార్యక్రమానికి క్రైస్తవులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మరిన్ని వివరాలకు 9121710896ను సంప్రదించాలన్నారు.

విద్యార్థుల చదువులకు ప్రభుత్వం భరోసా

దాచేపల్లి : విద్యార్థుల చదువులకు ప్రభుత్వం భరోసా కల్పించిందని ఎంఈవో పినాకపాణి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ వార్షికోత్సవం సోమ వారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కొప్పుల సాంబయ్య హాజరయి మాట్లాడుతూ 100 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ హైస్కూల్ ఎంతో మంది విద్యార్థులకు మంచి భవిష్యత్‌ని ఇచ్చిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాడు–నేడు ద్వారా హైస్కూల్‌ని అభివృద్ధి చేసిందని, విద్యార్థులు చదువుకునేందుకు అన్ని వసతులు కల్పించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు మునగా పున్నారావు, పార్టీ పట్టణ కన్వీనర్ షేక్ సుభానీ, ఎస్ఎంసీ చైర్మన్ షేక్ సైదావలి, నాయకులు షేక్ ఖాదర్‌భాషా, ఎంఈవో పినాకపాణి పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా సైన్స్ ఫేర్

పిడుగురాళ్ల: నిత్య జీవితంలో విజ్ఞాన శాస్త్రం ఎంతో ముఖ్యమని గీతిక సీబీఎస్ఈ స్కూల్ చైర్మన్ టి.బాల గంగాధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బ్రహ్మణపల్లి గ్రామంలో ఉన్న గీతిక సీబీఎస్ఈ స్కూల్లో సోమవారం సైన్స్ ఫేర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నేటి మానవాభివృద్ధిపై సైన్స్ ప్రభావం ఎంతో ఉందని, అది మన జీవితంలో భాగమైందన్నారు. సైన్సులో ముందున్న దేశాలన్ని అభివృద్ధి దశలో ఉన్నాయని చెప్పారు. సైన్స్‌లో ఎన్నో నూతన ఆవిష్కరణలు రావాల్సిన అవసరం ఉందని ప్రిన్సిపల్ శ్రీనివాసరావు అన్నారు. విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాత్మక నూతన ఆవిష్కరణలు పలువురిని ఆకర్షించాయి. విద్యార్థులను చైర్మన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో టి.పద్మశ్రీ, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మనుషులంతా ఒక్కటే అని చాటి చెప్పిన సేవాలాల్

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



సద్గురు సంత్ సేవాలాల్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: మనుషులంతా ఒక్కటేనని ఆ రోజుల్లోనే చాటి చెప్పిన సుగాలీల ఆరాధ్య గురూజీ సద్గురు సంత్ సేవాలాల్ అని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని రెడ్డిగారి పెట్రోల్ బంక్ ఎదురుగా ప్రధన రహదారి మధ్యలోని డివైడర్ వద్ద ఆదివారం రాత్రి సుగాలీల ఆరాధ్య గురూజీ సద్గురు సంత్ సేవాలాల్ విగ్రహాన్ని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం అధ్యక్షుడు జఠావత్ రాంబాబు నాయక్‌లు ముఖ్య అతిథులుగా హాజరై విగ్రహాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి 6వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ అజ్మీరా శారద అధ్యక్షత వహించారు. ముందుగా ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డికి బంజారాల వాయిద్యాలు, నృత్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. లంబాడి నృత్యాలు ప్రత్యేకంగా నిలిచాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ సుమారు 250 సంవత్సరాల క్రితం కర్ణాటక రాష్ట్రంలో జన్మించిన సేవాలాల్ దేశంలోని మనుషులందరూ ఒక్కటేనని, అలాగే మహిళలను గౌరవించాలని వారి పట్ల మర్యాదగా మెలగాలని చెప్పిన గొప్ప గురూజీ అని అన్నారు. చివరికి అడవిలో నివసించే వారికి కూడా అడవిలో జంతువులను వేటాడి చంపొద్దని చెప్పారన్నారు. అందుకే బంజారాలకు ఆరాధ్యుడిగా, పూజలు అందుకునే దేవుడిగా చరిత్రలో నిలిచారని చెప్పారు. నాగరికత పెరగడంతో నేడు సుగాలీలు పట్టణాలకు చేరుకొని పది మందికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఎక్కడా అసమానతలు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సుగాలీలను ఆదుకుంటుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చి ఉచితంగా అందిస్తున్నారని పేర్కొన్నారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు సుగాలీలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. ఆల్ ఇండియా బంజార సేవా సంఘం అధ్యక్షుడు జఠావత్ రాంబాబు నాయక్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రత్యేక ప్రాధాన్యతను కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, కౌన్సిలర్లు అజ్మీరా శారద, కత్తెరపు వాసుదేవరెడ్డి, మాదాల కిరణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంగల్‌రెడ్డి, యూత్ నాయకులు మంజా నాయక్, రాజు నాయక్, మాన్య నాయక్, చందు నాయక్, సాయి నాయక్, రంగా నాయక్, హరి నాయక్ , బాలు నాయక్, శ్రీను నాయక్, వేణు నాయక్, ఢాకు నాయకు, రాము నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పులిచింతల నిర్వాసితుల గృహాలకు నిరంతరం రిజిస్ట్రేషన్



తహసీల్దార్ శ్యామ్ సుందర్ రాజా

పిడుగురాళ్ల: పులిచింతల నిర్వాసితుల గృహాలకు నిరంతరం రిజిస్ట్రేషన్లు జరుగుతాయని తహసీల్దార్ ఎం.శ్యామ్‌సుందర్ రాజా అన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ పిడుగురాళ్ల పరిధిలో ఉన్న పులిచింతల నిర్వాసిత కేంద్రాలకు ఇక నుంచి రిజిస్ట్రేషన్లు తాను నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు పులిచింతల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు రిజిస్ట్రేషన్ చేసే అధికారం ఉండేదని, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం స్థానిక తహసీల్దార్‌కు ఆ అధికారాన్ని కల్పించిందన్నారు. ఈ కార్యక్రమం నిర్వాసితుల గృహాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అయ్యేంతవరకు జరుగుతుందన్నారు. ప్రజలు ప్రశాంతంగా వారి గృహాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని, తొందర పడొద్దని పేర్కొన్నారు. పిడుగురాళ్ల పరిధిలో కరాలపాడు-1 (అయ్యప్ప నగర్)లో 577 మంది గృహాలు, కరాలపాడు-2 (న్యూ వెల్లంపల్లి)లో 366 మంది గృహాలు, కొండమోడు (న్యూ పిడుగురాళ్ల) 914 మంది గృహాలు ఉన్నాయి. మొత్తం 1,857 మంది గృహాలకు రిజిస్ట్రేష న్లు నిర్వహించాల్సి ఉండగా మొదటి రోజు 50 రిజిస్ట్రేషన్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ ధనలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ భూముల పరిశీలన



అటవీ భూములు పరిశీలిస్తున్న తహసీల్దార్ గీతారాణి

దాచేపల్లి : మండలంలోని భట్రుపాలెం గ్రామంలో గిరిజనులు సాగు చేస్తున్న అటవీ భూములను తహసీల్దార్ గీతారాణి సోమవారం పరిశీలించారు. గత కొన్నేళ్లుగా ఈ గ్రామంలో 91 మంది రైతులు అటవీ భూములను సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. అటవీ హక్కుల గుర్తింపు చట్టం ద్వారా పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ద్వారా జిల్లా కలెక్టర్‌కి ఇటీవల వినతి పత్రం అందజేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ గీతారాణి గిరిజనులు సాగు చేస్తున్న భూములను పరిశీలించి వివరాలు సేకరించారు. ఏళ్ల తరబడి కంది, పత్తి, మిర్చి పంటలను సాగు చేస్తున్నట్లుగా గుర్తించారు. తమకు త్వరగా పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ని గిరిజనులు కోరారు. నివేదికను ఆర్డీవో ద్వారా జిల్లా కలెక్టర్‌కి పంపిస్తామని తహసీల్దార్ గీతారాణి చెప్పారు. ఈ పరిశీలనలో సర్పంచ్ భూక్యా కొండనాయక్, ఎంపీటీసీ మూఢవత్ రెడ్యానాయక్, మాజీ సర్పంచ్ రత్యా నాయక్, నాయకులు భూక్యా కల్యాణ్‌నాయక్, పిచ్చా నాయక్ తదితరులున్నారు.

వంద శాతం పోలియో చుక్కలు వేయడమే లక్ష్యం



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ కోటేశ్వరరావు



పల్స్ పోలియో చుక్కలు వేయించుకున్న చిన్నారితో మాట్లాడుతున్న గీతాంజలి

మెడికల్ ఆఫీసర్ కృష్ణారెడ్డి

రెంటచింతల: దేశంలో పోలియో మహమ్మారిని సమూలంగా నిర్మూలించడంలో భాగంగా చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమం ద్వారా మండలంలో 0–5 సంవత్సరాలలోపు పిల్లలకు నూరు శాతం పోలియో చుక్కలు వేయడమే లక్ష్యమని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం గ్రామాలలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి మరో 79 మంది చిన్నారులకు, మొబైల్ టీం ద్వారా నలుగురికి పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. మండలంలో మొత్తం 3,679 మంది ఉండగా ఇప్పటి వరకు 3,648 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరిగిందని మిగిలిన 31 మంది చిన్నారులకు మంగళవారం పోలియో చుక్కలు వేస్తామని దీంతో 100 శాతం పూర్తవుతుందన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.కోటేశ్వరరావు, ఆరోగ్య, ఆశా కార్యకలు పాల్గొన్నారు.

పల్స్ పోలియో పరిశీలన

దాచేపల్లి : పల్స్ పోలియో కార్యక్రమాన్ని రెండవ రోజు సోమవారం కూడా చేపట్టారు. నగర పంచాయతీతో పాటు గ్రామాల్లో 17,984 గృహాలకు గాను 12,758 గృహాలను సందర్శించి 302 మంది చిన్నారులకు ఆరోగ్య సిబ్బంది పోలియో చుక్కలు వేశారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిణి గీతాంజలి దాచేపల్లిలో నిర్వహిస్తున్న పోలియో చుక్కల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆరోగ్య సిబ్బందితో పాటు పోలియో చుక్కలు వేయించుకున్న చిన్నారులతో మాట్లాడారు. అనంతరం దాచేపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యసేవల పట్ల రోగులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట పల్స్ పోలియో నోడల్ అధి కారి డాక్టర్ సోనియామెర్త, డాక్టర్లు సుచరిత, అమూల్య, సహీనా సుల్తానా, మధు, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, ఆరోగ్య విస్తరణ అధికారి పట్టాభి, కృష్ణకుమారి, సూపర్‌వైజర్లు సరస్వతి, మేరికుమారి ఉన్నారు.

ప్రతి ఒక్కరూ భద్రత ప్రమాణాలు పాటించాలి



అధికారులు, కార్మికులతో నిర్వహిస్తున్న జాతీయ భద్రత వారోత్సవాల ర్యాలీ

సత్రశాల(రెంటచింతల): కర్మాగారంలో పనిచేసే ప్రతి ఒక్కరూ సురక్షితమైన భద్రత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ రాజు కోరారు. స్థానిక పరాశక్తి సిమెంట్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఆవరణలో సోమవారం 53వ జాతీయ భద్రతా వారోత్సవాలలో ఆయన కార్మికులతో కలిసి భద్రతా జెండాను ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేయించి మాట్లాడారు. ప్రతి ఒక్కరు తమ వెనుక ఒక కుటుంబం ఉందనే విషయాన్ని మరచిపోకూడదన్నారు. కార్మికులకు భద్రత, ప్రమాదాల తగ్గింపుపై భద్రత పోస్టర్లు, నినాదాలు, పలు పోటీలు, భద్రతా ప్రదర్శనలతో అవగాహన పెంపొందించడానికి ఈ నెల 4 నుంచి 10 వరకు భద్రత వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కార్మికుడు భద్రత అనేది వారి వ్యక్తిగత బాధ్యతగా భావించి పనిచేయాలన్నారు. అనంతరం కార్మికులతో కలిసి ఫ్యాక్టరీ ఆవరణలో జాతీయ భద్రతా వారోత్సవాల ర్యాలీని నిర్వహించారు. మంగళవారం నిర్వహించనున్న కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎంవీ శివ కుమార్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ బి.రాంబాబు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కార్మికులు, లారీ డ్రైవర్లు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సముచిత స్థానం



నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులు

దుర్గి: జగనన్న ప్రభుత్వంలో అన్ని సామాజిక వర్గాలకు సముచిత స్థానం కల్పించిన ఘనత పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డికే దక్కుతుందని దుర్గి వ్యవసాయ మార్కెట్ యార్డు పాలక వర్గ సభ్యులు అన్నారు. సోమవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యదర్శి కొమ్ము చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ నెల 12వ తేదీ మంగళవారం సాయంత్రం 5 గంటలకు స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగనున్నట్లు తెలిపారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన తమ కుటుంబ సభ్యురాలు కొమ్ము కౌసల్యకు దుర్గి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ పదవి కేటాయించటం పట్ల ప్రభుత్వ విప్ పీఆర్కే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పీవీఆర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. వైస్ చైర్మన్‌గా ఎంపికైన గురజాల రామారావు మాట్లాడుతూ తమకు అవకాశాన్ని కల్పించిన పిన్నెల్లి సోదరులకు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. అన్ని వర్గాలకు సముచిత స్థానాన్ని కల్పించిన పీఆర్కేను రాబోయే ఎన్నికలలో అఖండ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. పలువురు నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిడుగురాళ్ల: పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు మంగళవారం అంతరాయం కలుగుతుందని పట్టణ విద్యుత్ శాఖ ఏఈ అరికట్ల శివనాగిరెడ్డి సోమవారం తెలిపారు. సబ్‌స్టేషన్ మరమ్మతులలో భాగంగా ఈ అంతరాయం కలుగుతుందన్నారు. పట్టణంలోని మెయిన్ రోడ్డుకు పడమర వైపు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏరియా, కుమ్మరి పాలెం, శీతారాంపురం తండా, అంజిరెడ్డి హాస్పిటల్ వైనుక వైపు, మిలటరీ కాలనీ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ పేర్కొన్నారు.

రామకృష్ణ సేవలు మరువలేనివి



రామకృష్ణ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది

మాచర్ల: భారతదేశంలో, వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో సిమెంట్, షుగర్ ఫ్యాక్టరీలు నెలకొల్పి ఉత్తమ పారిశ్రామికవేత్తగా ఎదిగిన స్వర్గీయ వెలగపూడి రామకృష్ణకు ఆ ఘనత దక్కుతుందని కేసీపీ సంస్థ జనరల్ మేనేజర్ వి.వెంకట రమణ, డీజీఎం రామ కోటేశ్వర రావు, హెచ్‌ఆర్ మేనేజర్ జి.శ్రీనివాసరావు లు అన్నారు. సోమవారం స్వర్గీయ వెలగపూడి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీపీ ఫ్యాక్టరీలో ఏర్పాటు చేసిన వినాయకుని దేవాలయం వద్ద ఉద్యోగులు, కార్మికులు పూజలు నిర్వహించారు. ఫ్యాక్టరీ ఆవరణలో ఉన్న వెలగపూడి రామకృష్ణ విగ్రహానికి సంస్థ జీఎం, డీజీఎం, హెచ్‌ఆర్ మేనేజర్, వెల్ఫేర్ ఆఫీసర్, తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. సాయంత్రం పట్టణంలోని పాత కిడ్స్ పాఠశాల ఆవరణలో కార్మికుల మధ్య రామకృష్ణ జయంతిని నిర్వహిస్తూ ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా కిడ్స్ పాఠశాల హెచ్‌ఎం రామకష్ణ శాస్త్రి, కేసీపీ ఉద్యోగ సంఘ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రామకృష్ణ జయంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మానవత్వాన్ని చాటిన వలంటీరు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కోటేశ్వరరావుకు పెన్షన్ అందజేస్తున్న వలంటీరు లక్ష్మి



బచ్చు నాగలక్ష్మికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ నవీన్

దుర్గి: మండల కేంద్రమైన దుర్గిలోని గ్రంధి కోటేశ్వరరావు అనే వృద్ధుడు అనారోగ్యంతో గుంటూరు కాటూరు ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో విషయం తెలుసుకున్న గ్రామ వలంటీరు చింతా లక్ష్మి ఆసుపత్రికి వెళ్లి సోమవారం వృద్ధుడికి పెన్షన్ అందజేసింది. పేదరికంతో కనీస ఖర్చుల కోసం ఇబ్బంది పడుతున్న పెన్షనర్ కోటేశ్వరరావుకు పెన్షన్ అందజేయటం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. వలంటీర్ల సేవలకు పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు అభినందనలు తెలిపారు.

157 కిలోమీటర్లు వెళ్లి పింఛన్ ఇచ్చిన వలంటీర్

దాచేపల్లి : సేవకు ప్రతిరూపం వలంటీర్ అనటంలో సందేహం లేదు.. సేవాభావం కలిగిన వలంటీర్ దూర ప్రాంతంలో ఉన్న వృద్ధురాలి వద్దకు వెళ్లి పింఛన్ నగదు అందజేశారు. వలంటీర్ ద్వారా పింఛన్ నగదు అందుకున్న ఆ వృద్ధురాలు సీఎం జగన్‌ని ఆశీర్వదించింది. మండలంలోని తంగెడ గ్రామానికి చెందిన బచ్చు నాగలక్ష్మి కొల్లూరు మండలం చింతలంక గ్రామంలోని కుమార్తె వద్దకు కొద్దిరోజుల క్రితం వెళ్లింది. వృద్ధాప్యంలో ఉన్న తాను పింఛన్ నగదు కోసం స్వగ్రామానికి రాలేనని వలంటీర్ చల్లగుండ్ల నవీన్‌కి చెప్పింది. మానవతా దృక్పథంతో నవీన్ తంగెడ నుంచి 157 కిలోమీటర్ల దూరంలో ఉన్న చింతలంక గ్రామానికి సోమవారం వెళ్లి వృద్ధురాలు నాగలక్ష్మికి రూ.3 వేల పింఛన్ అందించాడు.

నేడు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

వెల్దుర్తి: నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు మంగళవారం చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి సోమవారం తెలిపారు. మాచర్ల మండలంలోని గన్నవరంలో, కారెంపూడి మండలంలోని మిర్యాల గ్రామంలో, రెంటచింతల మండలంలోని జెట్టిపాలెంలో, విద్యుత్ సబ్‌స్టేషన్‌లు ప్రారంభోత్సవం, రెంటచింతల, కారెంపూడి, దుర్గి, శిరిగిరిపాడులలో 11కె/ఎల్‌టీ పను లకు భూమి పూజ, శంకుస్థాపన, మాచర్ల మండలంలోని నాగులవరం, చింతలతండాలలో 33/11 పనులకు భూమి పూజ, శంకుస్థాపనలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలలో ఆయా మండలాల, గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సంబంధిత శాఖాధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

సంద్రి మార్కెట్‌కు 11న వేలం

పిడుగురాళ్ల: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఈ నెల 11న సంద్రి మార్కెట్ వేలం పాటలు నిర్వహించనున్నటుల్ ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ సోమవారం తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఈ వేలం జరుగుతుందన్నారు. ఇందులో కురగాయా ల మార్కెట్, సంద్రి మార్కెట్, చేపలు, మాంసం, కబేళాల మార్కెట్‌లకు వేలం పాటలు నిర్వహిచనున్నారని చెప్పారు. వేలంలో పాల్గొనే వారు 11 వ తేదీ మధ్యాహ్నం 1 గంట లోపు ధారవత్తును చెల్లించాలని తెలిపారు. ఈ వేలం సాయంత్రం 4 గంటలకు నిర్వహించడం జరుగుతుందన్నారు.